# ౨. చెల్లమ్మ సినీమా చూపు

అది పట్నంలో నాలుగురోడ్లూ కలిసేకూడలి. ప్రక్కనో రోడ్డుకు సైడుకాల్వతూము. తూమ్మీద ఎడంపాదంమోపి మోకాలి వంపుగాదేల్చి మోకాలిమీద ఎడంమోచేయి ఆనుకొని చేతిలో చిబుకం దాచుకొని గోళ్లు మెఱయిస్తూ, రెండోచేయి నడుముకెట్టుకొని, మాట్లాడుతూంది ఒక ఒంటెద్దుబండివానితో పనిపిల్ల చెల్లమ్మ.

'చెల్లి' అనాలి నిజంగా దానివయస్సునుబట్టి అనవలసొస్తే, అమ్మ ఏమిటి పదేనేళ్ళగుంటని?—అది చూచేది అక్కడ విప్పేసున్న బండెద్దునుమాత్రమే. కాని దాన్నిచూచేవారు చాలామంది వున్నారు. ఎదర తూంకాడ నిలబడ్డ ఓబిరుసు వెంట్రుకల గుజ్జు క్రాప్డ హెడ్ రౌడీ బసవన్న, పక్కింటి అరుగుమీద ఓప్లీడర్, వీధేపోతూవున్న ఓమాస్టర్, దూరంగా కుళాయిదగ్గఱ నీళ్లుపట్టే ఒక వంటబ్రాహ్మడు, వీరేంటి? వారేంటి ఆసమయాన్ని. ఆలా నడుస్తూండాలి అంతే మనిషై, మగాడైనవాడు, తప్పకుండా దానొంక ఓమాఱు చూచేడన్నమాటే.

మెళ్లో దానికున్నది నూలుతాడు. తీగన్నాలేదు. కట్టుకున్నది ఎఱ్ఱదనమంతా వెలిసిపోయి కఱ్ఱడచీర. చెంగలాఇలా విసురుకోవడంలో తొలిగిందా, లోదిక్కుగ కనిపించే దో పిగులుడురైక.

మాయదారి సయితి కంతాచెమటే, ఆ బిండోడితోటి మాటాడు తూన్నంత సేపూ అంతాచూపే, అంతా గుసగుసే! అంతనడివీధిలో అంత ఏకాంతం ఎలా సాధ్యమనుకుంటూందో !

సర్వం భాషగుండా వెలువరిస్తే కష్టంగాని: కొంతనవ్వుతోనూ, కొంత చేతులూపుతోను, కొంతకులుకుతోనూ కొంత విసుకుతోనూ, కొంత నసుకుతోనూ, కొంతపరాగ్గా రెప్పలాడించుకోవడంతోనూ, కొంత కొప్పు విప్పుకు మళ్ళీ ముణుసుకోవడంతోనూ, ఇలాగ్గా లక్షాతొంభై విధాలుకలిపి, రెండోవాడికి తెలియని మచ్చు అభిప్రాయం మొలకగా, మొలకకు చిల పగా, చిలవకు పలవగా, పలవకుబదనికగా, బదనికకు పెద్ద ఎగబ్రాకీ తీగెలవొంకగా చుట్టబెట్టి నెత్తికెక్కిస్తూంటే కష్టమేముంది !

వెళ్ళిపోయినారు వాళ్ళిద్దరూ చెరోదార్నీ.

రాత్రి తొమ్మిదైంది. బిళ్ళఘూటీలో బండిప్పుకొని బండన్న ఎద్దు నోరసిలగా కట్టేసి తాను కాడిమీద నడుమానుకు వెల్లకితలా తొంగున్నాడు కొసకోకాలు తన్నిపెట్టి. కింద చాప్పబచుకు పడుకున్నాడా అంటే రొచ్చు, చెత్త — ఆ పొద్దే వర్షం కురిసిందేమో మరీలతాడు. తక్కిన బిళ్ళవాళ్ళు మఱీకొందఱు రోడ్డుమీదే తొంగుండారు. అడ్డదిడ్డంగా— వాళ్ళ వడకచూస్తే జాలిగొలుపుతూ వున్నమాట నిజమే. కాని ఒకడి దారిద్ర్యం ఒకడు తీర్చాలీ అంటే ఎట్లా ?

తెల్లాటిలేస్తే జాలిగొలిపే దృశ్యాలు కోటానకోట్లు ఇంకా తెల్లా. రదు: కడజాతి తుడుపుడుగాండ్రు తుడుపుడుకత్తెలు "అమ్మగారూ ! తలుపండో!" అని కేకేస్తారు. పెద్దిళ్ళ దంపతులు మంచాలమీదనుంచి లేవనన్నా లేవరప్పటికి. వీళ్ళభోగమిలా దండికావడమేం: వాళ్ళభోగ

మలా మండిపోవడమేం ? గుడి గుమ్మంముందు గూర్చుని ఓ ముష్టి ముండాకొడుకు నడవలేని ముసీలివరుగై "నా కడుపు తగులడిపోతూంది బాబుల్లారా ! నా కడుపు సుసైపోతూంది మామ్మల్లారా !" అని అటవడమేం, గుళ్ళో అర్చకుడు పులిహోరా చిట్టిగారెలూ తిని తెగ త్రేన్చడమేం ? "మూట సెబుతారా నాయుడుగారూ !" అంటూ కళ్ళల్లోంచి పిగ్గొదిలి తూరుపోళ్ళ చిన్నమ్మి నడిబజారులో తట్టుచ్చుకు వెంటాడించడం ఖర్మమేం ? యురేషియన్ మిస్ ఫాషన్ పెద్దనోటు చేత పట్టుకు "చిల్లరుండా బన్యాసార్!" అని మోటారుకారులోంచే చెయ్యూపే వైభోగమేం ? ఇలా వ్యత్యయాలు ప్రతీనిత్యమూ ఒంట బట్టేటప్పుడు ఎందుకింక జాలిపడ్డం ? బళ్ళవాళ్ళు కింద పడుకున్నారూ అని చెప్పి ఎందుకు విచారించడం ?

మునిసిపల్ లైట్లు లేవు, వెన్నెలరాత్రిళ్ళు అని కామోసు. కాని భగవంతుడు ఆ రాత్రి ఎంచేతో వెన్నెల కాపించడంలేదు. మబ్బు వేయించేడు. భగవంతుడు మబ్బు వేయించినప్పుడు పోనీ మానవుడు సర్దుకొని లైట్లు వేస్తాడా అంటే వీడికాబుద్ధిలేదు. వీడిలా ! వీడితర్కం! తాను గోతిలో పడుతూవున్నా విడిచిపెట్టని వీడి ఆర్థికసూత్రం ! వీడివి!

రోడ్డుమధ్య కయలడ్డాది. పుసుక్కున అందులో ఓ స్త్రీవ్యక్తి అడుగేస్తూ—"అబ్బ సడుం బెణికిపోయిందిరా బాబా ! అంటూ ముందుకో ఎగ్గుంజు గుంజుకుని పైకిబడి "ఈ బళ్ళముండాకొడుకులంతా పోగై యొక బండి యినకా కంకరా పోసికున్నా కప్పడిపోయూది యీ గొయ్యి మునిసిపాలిటీ దహిడీలకు బుద్ధిలేకపోతే" అని అనుకుంటూ తిన్నగా కాడిమీద పవళింపు వేపగొన్న బండన్న దగ్గరు కొచ్చింది.

"ఒరే ! సూరన్నముచ్చా ! లెగరా ! మొదటి ఆట అవుతున్నట్టుంది. తొమ్మిదింటికే నిద్రరంట్రా ?" అంది. ఎద్దు చిరుమువ్వలు ఘల్లుమన్నాయి. "మామంచిమువ్వలు కట్టావే ఎద్దుకు ?" అంది. "చెల్లీ!" అన్నాడు సూరన్న ఓచేత్తో నేలానుకులేస్తూ. చెల్లి "ఆః రాః"అంది. 'మరి నీ అణా తెచ్చుకున్నావు ?" అన్నాడు సూరన్న. "ఏం ? నీ దివ్వ లేవు ?" అంది కుట్టిది. సూరన్న అన్నాడు "నాకీ యేళ కోడీబేరం బేడబ్బులు తప్ప మళ్లీ బం డెక్కిన బ్రహ్మాండనాయకుడు లేనేలేడే చెల్లీ ! ఆ బేడబ్బులు కీ అర్ధణాపెట్టి మినపరొట్టి పడవలరేవులో కొనుక్కొని తిని సాయంత్రం అలా వస్తుండడమే నా నడుస్తూవుండడము నీవు తూంకాడ కనిపించడం ! ఆరుడబ్బులుండాయే : ఇంక !" అన్నాడు. "ముందు నెగు సూద్దారి. వెళ్ళలేకపోతాంవేంటి ?" అంది చెల్లి.

ఎద్దును గట్టిగాం థా డెట్టి బండి ఆకుక్కకట్టి, ఎద్దు ముందింత గడ్డి విదిపి, చాప లోపలకంటా చుట్టి తోసేసి, "నడువ్" అంటూ సూరన్న చెల్లితో సినీమా రెండో ఆట చూడ్డానికి బయల్దేరాడు.

ఇద్దరూ సినిమాహాలు ముంగిటకు చేరుకున్నారు. ఎక్కణ్ణుంచి తీసియిచ్చిందో చెల్లి రెండు కొత్తకాసులు తీసి సూరన్న చేతిలోపెట్టి నీ దగ్గిరివి ఆరుడబ్బులూ వేసి రెండుటిక్కట్లు కొనుక్కురా"అంది. సూరన్న ఓమాటు చెల్లి మొఖంకేసి చూసి "నాకు రెండు డబ్బులు తగిలించావు ?" అని గుభాలునవెళ్ళి రెండుటిక్కట్లూ తెచ్చి, ఒకటి చెల్లి చేతికిచ్చి "అలారా ఆడోళ్ళ గేటదీ" అన్నాడు. చెల్లి వెంటనే అడిగింది "నివ్వెక్కడ కూచుంటావు ?" అని. "నేను మొగాళ్ళల్లో ముందుగోతిలో" అన్నాడు. "ఆటయిపోనాక కేకెయి నన్ను అలావచ్చి" అంది. "ఊఁ" అన్నాడు. వెళ్ళి కూర్చున్నారు.

## సినీమా షో! తైలావు జూనీ టాకీ!

ఆటయింది. జనం అంతా గల్లంతుగా ఇవతలకు వచ్చేశారు; వెల్తుర్లోంచి చీకట్లోపడి రోడ్డంట పోతున్నారు కబుర్లు చెప్పుకుంటూ. సూరన్న అన్నాడు చెల్లితో "ఇలా! ఇలా! జవాన్ని చూచుకో. బళ్ళ ఘాటీ ఇటూ!" అన్నాడు. చెల్లి సూరన్న బుజమ్మీద చెయ్యేసి వాడి దారికే వస్తూ—

"ఒరే! సూరన్నా! ఈ సూపిందంతా నిజమేనంట్రా? ఆదికి పిచ్చెత్తడం ఆది వాడికోసం బాబాకరంగా బొకెట్టుకు పొడుసుకోవడం? ఆది నిజంగా జరిగిందే అంటావురా? సూరన్నా!" అంది. "కాకేం? పిచ్చేమిటే? పేమెక్కువయి నప్పుడు ఎక్కడ పడుకున్నదీ, ఏ మూలున్నదీ, ఏమెట్టి పొడుసుకునేదీ కూడా తెల్దు—నేను చూడు! నీవ పచ్చేముం దెక్కడ తొంగుడుండాను? కాడిమీద వెన్నెముక అను కొన్నదూ? అలా ఎలా తొంగో గలిగాను? నిన్ను తలుసుకుంటూ తొంగుడుండ గలిగేను. మాటాడవేం?" అన్నాడు సూరన్న. చెల్లి అంది "నా కోసరమైతే పదమాడి యుందువు" అని. "మటి ఆడుకోలే?"

"ఏమే చిన్నదానా! రయికే పిగిలింది!
ఏమే చిన్నదానా! చీరే తటిసింది!"

అని ఆడుకోలే నాలోనేను?" అన్నాడు.

"ఆరినీ జిమ్మలాగ ! ఉన్నావంట్రా ! ఆయేళ పడవల రేవులో నివ్వూను ! ఆళ్ళని తగలెయ్య ! రాదారి పడవ మింతగాళ్ళు — నేను పేకోజీపెట్టి నెత్తినెట్టుకు మోసుకెళ్ళి రెండు జబ్బలా పయికెత్తి పడవలోకి విసురుతూవుంటే ఫట్‌మని నా రయిక పిగిలి, డమాంతాడల్లే జంయిని నా చీరచుంగులు గంగలోకి జారి మోసగిస్తే ఆళ్ళని తగలెయ్య ఆ రాదారీ పడవ తెడ్డేతగాళ్ళు

"ఏమే చిన్నదానా ! రయికే పిగిలింది !
ఏమే చిన్నదానా ! చీరే తడిసింది !"

అవి పాట లంకించుకున్నారు — షవమేమో దిక్కుమాలిన కసుమాలపు చెమ టోడ్చి పనిచేసి బాధపడ్డం ! వాళ్ళకేమో సరాగం !" అంది చెల్లి.

"అలాగేనే ! నేను బండి ఎక్కడ ఎవడి కాలిమీదనుంచి పోతుందో అని, పోలీసోడెక్కడ రాసుకుంటాడో అని తొక్కుళ్ళాడుతూ తోల్తా వుంటానా—పక్కనే గ్రామోఫోను ప్లేటేంటిసొప్ప "ఓరి ! ఓరి ! బండి వోడ వగలమారి బండివోడ !" అన్నాడు సూరన్న. "అంతే ! గాజు లంగాడికాడ పూసలంగాడికాడ" అంది చెల్లి.

"ఎక్కడన్నా నన్నెవ్వరూ తాకరు. నన్నెవ్వరూ తగలరు. బొట్ట మోపుగా ఎద్దుమూడి తుడుస్తూ కూకోడమే నావని" అన్నాడు. "నన్ను మాత్రం తాకేవారున్నా రనుకున్నావా ? ఏంటి ? అంతా సినీమాచూపు చూచేవారేగాని !" అంది.

"అంచేతే నువ్వంటే నాకెంతో మో" అన్నాడు పూరన్న. "నివ్వంటే నాకూను" అంది చెల్లి.

ఇద్దరూ అలా ఉండిపోయారు సినిమా ఏక్షన్‌లో కొత్త సినిమా స్టార్‌లా వేగుచుక్క పొడిచేదాకా !

—:0:—

| రచన | స్ఫురణ | తొలిప్రకటనము |
|---|---|---|
| 10-9-1934 | రాజమండ్రి | "వినోదిని"లో |